క్లుప్తంగా

ఎవరూ అధైర్యపడకండి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక



హిందూపురం: గెలుపోటములు సహజం... ఎవరూ అధైర్యపడకండి అని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ టీఎన్.దీపిక ఆ పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓడిపోయినా నైతికంగా మన పార్టీనే గెలిచిందన్నారు. తనకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. హిందూపురంలో తానందరికీ అందుబాటులోనే ఉంటానన్నారు. ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని తెలియజేశారు. 2029 ఎన్నికల్లో అఖండ విజయాన్ని సాధించి తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసుకుందామన్నారు.

కూలిన వందేళ్ల వేపచెట్టు



పావగడ: తాలూకాలోని హుస్సేన్‌పురం గ్రామంలో బుధవారం వందేళ్ల వేప చెట్టు కూలిపోయింది. ఆ చెట్టు పక్కనే ఉన్న ఓ ఇంటిపై కూలిపోవడంతో ఇల్లుపై భాగం దెబ్బతింది. అనంతరం గ్రామస్తులు చెట్టును తొలగించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజునే వందేళ్లన్న చెట్టు కూలిపోవడం బాధాకరమన్నారు.

కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు



అనంతరాజు, జెడ్పీటీసీ సభ్యుడు, రొళ్ల

రొళ్ల: సార్వత్రిక ఎన్నికలు ప్రారంభమైనప్పటి నుంచి సుమారు నాలుగు నెలలకు పాటు వైఎస్సార్‌సీపీ విజయం కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు తెలిపారు. ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈరలక్కప్ప కేవలం 315 ఓట్ల తేడాతో పరాజయం పొందడం బాధాకరమైన విషయన్నారు. మళ్లీ గ్రామస్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసుకోవడానికి ప్రతి కార్యకర్త కూడా సైనికుల్లా పని చేయాలన్నారు. కార్యకర్తలందరికీ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుదని భరోసా ఇచ్చారు.

కొనసాగుతున్న విత్తన పంపిణీ

చిలమత్తూరు: ఖరీఫ్‌లో రైతులు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న విత్తన వేరుశనగ కాయల పంపిణీ బుధవారం కూడా కొనసాగింది. ఏఓ వంశీకృష్ణ మాట్లాడుతూ 466 మంది రైతులకు 255.8 క్వింటాళ్ల వేరుశనగను పంపిణీ చేశామన్నారు. ఇప్పటి వరకూ మండలంలో 2,834 మంది రైతులకు 2045.7 క్వింటాళ్లు పంపిణీ చేశామని చెప్పారు.


ఉపకార వేతనానికి ఎంపిక

సోమందేపల్లి: మండలంలోని జూలకుంట గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి చరణ్ జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం శ్రీధర్ తెలిపారు. ప్రతి ఏడాది రూ.12 వేలు ఉపకార వేతనం ఇస్తారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థి చరణ్‌ను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

అందరికీ పార్టీ అండగా ఉంటుంది

గుడిబండ: మండల వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు, నాయకులకు వైఎస్సార్‌సీపీ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్ తెలియజేశారు. బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో చమటోడ్చి పని చేసిన కార్యకర్తలకు, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పకు ఓటేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఎన్నికల ఫలితాల్లో దురదృష్టవశాత్తూ వైఎస్సార్‌సీపీ ఓటమి పాలైందని, అయితే ఎవరూ అధైర్యపడవద్దన్నారు. మళ్లీ నూతన ఉత్సాహంతో వైఎస్సార్‌సీపీని అధికారం తెచ్చుకొనే దిశగా అడుగులు వేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణే లక్ష్యం



గార్మెంట్స్ పరిశ్రమలో బీసీజీ టీకా అంశంపై చర్చిస్తున్న మెడికల్ ఆఫీసర్లు

పరిగి: దేశంలో క్షయ వ్యాధి అన్న పదమే వినపడకుండా శాశ్వత నివారణకు బీసీజీ టీకాలను వేయడం జరుగుతోందని మెడికల్ ఆఫీసర్లు నవీన, స్వరూపరెడ్డి తెలిపారు. 18 ఏళ్లు పైబడిన వారికి ఆయా రోగాల రుత్మతను బట్టి బీసీజీ టీకాలను ప్రతి గురువారం వేస్తున్నామన్నారు. టీకాలు ఇచ్చే అంశంపై బుధవారం మండలంలోని పరిగి, కాలువపల్లి గార్మెంట్స్ పరిశ్రమలను, స్పిన్నింగ్ మిల్లు కొడిగెనహళ్లి, మహర్షి ఐరన్ ఫ్యాక్టరీలలో ఆయా యాజమాన్య ప్రతినిధులతో ప్రత్యేక సమావేశమయ్యారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వన్నప్ప పాల్గొన్నారు.

ఆరోగ్యానికి వాకింగ్



- మారుతున్న జీవన శైలితో నడకకు పెరుగుతున్న ప్రాధాన్యం
- గుండె జబ్బులతో పాటు పలు రకాల వ్యాధులకు చెక్ పెట్టొచ్చంటున్న వైద్యులు

గుడిబండ: ప్రస్తుత ఆధునిక యుగంలో జీవన శైలి వ్యాధులతో పాటు వివిధ రకాల అనారోగ్య సమస్యలతో ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారు. ఏ ఇంట్లో చూసినా ఎవరో ఒకరు దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమవుతున్నారు. ఇందులో భాగంగానే వైద్యుల సూచనల మేరకు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రజలు పెద్ద ఎత్తున వ్యాయామంపై దృష్టిసారిస్తున్నారు. మరీ ముఖ్యంగా పల్లెల నుంచి పట్టణాల దాకా వాకింగ్ చేస్తూ ఆరోగ్యాన్ని క్రమబద్ధీకరించుకుంటున్నారు.

వ్యాయామంతో మానసికోల్లాసం

రోజుకు గంట వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుంది. ఆలోచన సామర్థ్యం కూడా పెరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీంతో ఆరోగ్యాభిలాషులు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తున్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ చూపిస్తూ ఉదయం, సాయంత్రం వేళల్లో వీలైతే జిమ్‌లకు వెళ్లడం, యోగా, సైక్లింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. వృద్ధులు, యువత సైతం పాత శాల మైదానాలు, తాము నివాసం ఉంటున్న ప్రాంతాల్లో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో వాకింగ్, వ్యాయామం చేస్తున్నారు. గతంలో పోలిస్తే వాకింగ్ చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని వ్యాయామ ఉపాధ్యాయులు చెబుతున్నారు.

అధిక బరువుతో చిక్కులు

ప్రస్తుతం జీవన విధానంలో వచ్చిన మార్పులు కారణంగా జనాభాలో అధిక శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, యువత అధిక బరువు కారణంగా చిన్న వయస్సులోనే వ్యాధులు బారిన పడుతున్నారు. ఫాస్ట్‌ఫుడ్స్, కేక్‌లు, పిజ్జాలు, బర్గర్‌లు, చాట్స్ వంటి జంక్‌ఫుడ్స్‌ను అధికంగా తీసుకుంటుండటం అధిక బరువుకు కారణమవుతోందని వైద్యులు చెబుతున్నారు. దీంతో బరువు తగ్గేందుకు అధిక శాతం మంది వాకింగ్ చేస్తున్నారు.



గుడిబండ మండల కేంద్రంలో వాకింగ్ చేస్తున్న మహిళలు

నడకతో ఆరోగ్యం

ప్రతిరోజూ నడకతో జీవన శైలి వ్యాధులైన బీపీ, షుగర్‌లను అదుపులో ఉంచుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. గుండెజబ్బులు, చెడు కొలెస్ట్రాల్, కీళ్లు, మోకాళ్ల నొప్పులు, ఆందోళన, మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చంటున్నారు. శారీరక శ్రమతో చిన్నారులను ఆడించడం ద్వారా వారిలో ఎదుగుదల, మానసిక పరిపక్వత, ఏకాగ్రత, మంచి ఆలోచనా శక్తి పెరుగుతుందని సూచిస్తున్నారు.

కరోనా తర్వాత....

కరోనా విపత్కర పరిస్థితుల అనంతరం ఆహారపు అలవాట్లు, వ్యాయామం, పరిశుభ్రత వంటి అంశాలలో ప్రజలలో అవగాహన స్థాయి పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా చక్కని ఆరోగ్యంపై అందరూ శ్రద్ధ పెడుతున్నారని అంటున్నారు. శారీరక శ్రమతో కలిగే ప్రయోజనాలను వివరించేందుకు ప్రభుత్వం కూడా ఎంతో కృషి చేస్తోంది. వివిధ రకాల ఆటలపోటీలతో పాటు అవగాహన సదస్సులను నిర్వహిస్తోంది.

శరీరం చలాకీగా ఉంటుంది



గత ఐదేళ్లుగా నేను వాకింగ్ చేస్తున్నాను. రోజూ ఉదయం, సాయంత్రం సమయంలో 40 నిమిషాల పాటు నడుస్తున్నాను. దీని వల్ల నాకు ఇప్పుడు బలహీనత అంటూ తెలియడంలేదు. ఆరోగ్యంగా ఉంటున్నా శరీరం చలాకీగా ఉంటోంది.
– భోజరాజు, ఫళారం, గుడిబండ మండలం

మంచి ఆరోగ్యం ఖాయం



క్రమం తప్పకుండా గత ఏడేళ్లుగా నేను వాకింగ్ చేస్తున్నా. ఉదయం, సాయంత్రం తప్పకుండా కుటుంబ సభ్యులతో కలిసి వాకింగ్ చేస్తున్నాను. ప్రస్తుతానికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవు. అందరూ నడకను అలవాటు చేసుకుంటే మేలు.
– సతీష్, దేవరహట్టి, గుడిబండ మండలం

వాకింగ్‌తో రోగాలకు చెక్



రోజుకు గంటన్నర నడకతో మంచి ఆరోగ్యంతో పాటు శరీర దారుఢ్యం పెరుగుతుంది. ప్రతిరోజూ నడవడం ద్వారా ఎన్నో రోగాలకు చెక్ పెట్టొచ్చు. మరీముఖ్యంగా బీపీ, షుగర్ నియంత్రణలోకి వస్తాయి. వైద్యులు కూడా వాకింగ్ తప్పనిసరని చెబుతున్న సంగతి అందరికీ తెలిసిందే. – అజారుద్దీన్, పీఈటీ, గుడిబండ

ప్రభుత్వం నిర్ణయించిన ఫీజునే వసూలు చేయాలి



శ్రీచైతన్య పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హిందూపురం టౌన్: ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు పట్టికను పాఠశాలలో నోటీస్ బోర్డులో ప్రదర్శించడంతో పాటు దాన్ని అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల ఎదుట ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి శ్రీ చైతన్య విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే తల్లితండ్రులకు మాయమాటలు చెప్పి ముందస్తుగా అడ్మిషన్లకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు పట్టికను పట్టణంలో కార్పొరేట్ విద్యాసంస్థలు ఏమాత్రం పాటించకుండా వాళ్లకు ఇష్టం వచ్చినట్టు లక్షల రూపంలో ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే అనుమతులు లేకుండా నడుపుతున్న బ్రాంచులను సీజ్ చేయాలన్నారు. అదేవిధంగా విద్యార్థులకు విద్యాసంస్థల పేర్లతో ముద్రించిన పుస్తకాలను రూ.6 వేల నుంచి రూ.12 వేల వరకు విద్యాసంస్థలు అమ్ముతున్నారన్నారు. కనీసం విద్యార్థులకు సరైన సౌకర్యాలు కూడా లేకుండా చైతన్య పాఠశాల నిర్వహణ జరుగుతోందన్నారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు పట్టికను కచ్చితంగా పాటించేలా ఆదేశాలు జారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు చంద్రశేఖర్, తరుణ్, హర్ష కుమార్, భగత్, పవన్, మహేష్, జస్వంత్, మణికంఠ, శివ, శ్రీనివాస్, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నిర్ణయాన్ని శిరసావహిస్తాం

- మాజీ మంత్రి ఉషశ్రీచరణ్



పెనుకొండ: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తాం. గెలుపోటములు సహజమని మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ విజయం కోసం ఎంతో శ్రమించారన్నారు. అయితే పథకాలు తీసుకుంటూ చాలా మంది మన వెంట నడుస్తూనే టీడీపీకి ఓటు వేశారన్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఇలాంటి తీర్పు ఇవ్వడం చాలా బాధాకరమైన విషయమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధైర్యపడొద్దని, తానెప్పుడూ అండగా ఉంటానన్నారు. అన్ని మండలాల్లోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మొత్తం క్యాడర్ మనమే ఉన్నామని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి క్షేత్రస్థాయిలో పని చేయాలన్నారు. రాబోయే రోజుల్లో అందరూ కలసి కట్టుగా పనిచేద్దామని సూచించారు.

నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి



ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి సంపత్‌కుమార్ మృతికి సంతాపాన్ని తెలియజేసి ఇంటి నుంచి వస్తున్న ఎన్ఎస్‌యుఐ జాతీయ, రాష్ట్ర నాయకులు

హిందూపురం: ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి సంపత్‌కుమార్‌ను హత్యచేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఎన్ఎస్‌యుఐ జాతీయ అధ్యక్షుడు వరుణ్ చౌదరి డిమాండ్ చేశారు. గత నెల 30న దారుణ హత్యకు గురైన ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి సంపత్ కుమార్ కుటుంబాన్ని వరుణ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో సంపత్ తండ్రి ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా రాహుల్ ఆయనకు ధైర్యం చెప్పారు. తెలంగాణ ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు ఎంఎల్ఎస్ బల్మోర్ వెంకట్, కర్ణాటక అధ్యక్షులు కీర్తి గణేష్‌లు కూడా సంపత్ కుటుంబసభ్యులను పరామర్శించారు. పోలీసు అధికారులు త్వరితగతిన సంపత్ హత్యకు కారణాలు తెలుసుకుని నిందితులని అరెస్ట్ చేసి శిక్ష అనుభవించేలా చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. ఎస్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధుయాదవ్, ప్రధాన కార్యదర్శి నరేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధ్రువకుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇడపబత్తిని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం లోపాలపై ఈసీ దర్యాప్తు జరపాలి

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న వైసీ గోవర్ధన్‌రెడ్డి

మడకశిర: వైఎస్సార్‌సీపీ ఓటమితో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి సూచించారు. ఆయన బుధవారం 'సాక్షి'తో మాట్లాడుతూ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఎలాంటి కష్టం వచ్చినా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మండలంలోని గంగులవాయిపాళ్యం, ఆమిదాలగొంది తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు జరిగినట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. దాడులు చేస్తే ఊరుకోమని టీడీపీ నాయకులను హెచ్చరించారు. మడకశిరలో ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలని కోరారు. మడకశిర అసెంబ్లీకి సంబంధించిన ఈవీఎంల్లో జరిగిన లోపాలపై ఈసీ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకూ పోరాటం చేద్దామన్నారు.

కొనసాగుతున్న విత్తన పంపిణీ

లేపాక్షి: మండల వ్యాప్తంగా వేరుశనగ విత్తనకాయల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోందని వ్యవసాయాధికారిణి శ్రీలత తెలిపారు. ఇప్పటి వరకు 1400.4 క్వింటాళ్ల (4668 బస్తాలు) వేరుశనగ విత్తనకాయలను 2 వేల మందికి పంపిణీ చేశామన్నారు.

అగళిలో మోస్తరు వర్షం

అగళి: మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. వర్షం రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విత్తనలు వేయడనికి మందు వర్షాలు ముందుస్తుగా కురుస్తుండడంతో ఖరీఫ్ సాగుకు అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు.

మా ఓట్లు ఎక్కడికిపోయాయి ?

ఫలితాలు రివర్స్ ఎలా అవుతాయి?



సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై అనుమానాలు ఉన్నాయి. చందకచెర్లు గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేశాం. గ్రామంలో 70 శాతం వైఎస్సార్‌సీపీ పటిష్టంగా ఉంది. ఎంతో ఉత్సాహంతో వృద్ధులు, మహిళలు, పురుషులు గంటల తరబడి క్యూలో నిలిచి అధికంగా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేశారు. మంచి మెజార్టీ వస్తుందని ఆరోజు ఓటర్లలే చెప్పారు. ఆ ఓట్లు ఎక్కడిపోయ్యాయి. ఈవీఎంలను ట్యాపరింగ్ చేయడంతోనే వైఎస్సార్‌సీపీకి తక్కువ ఓట్లు వచ్చి ఉంటాయని అనుమానంగా ఉంది.
– శేషాద్రి, చందకచెర్లు, మడకశిర మండలం

వీవీ ప్యాట్‌లను మళ్లీ లెక్కించాలి



సార్వత్రిక ఎన్నికల్లో మా బూత్‌లో మేము వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే ఓటు వేశాము. మాతో పాటు మా కాలనీలో సుమారు 65 పైగా ఇళ్లున్నాయి. మొత్తం కూడా 90 శాతం మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే ఓటు వేయడం జరిగింది. అయిన కూడా వైఎస్సార్‌సీపీకి మెజార్టీ తగ్గడంలో ఆంతర్యామేమితో అర్థం కావడం లేదు. పార్టీ అధిష్టానం కేంద్ర ఎన్నికల దృష్టికి తీసుకెళ్లి తిరిగి ఈవీఎం, వీవీప్యాట్‌లో నమోదు అయిన ఓట్లను సక్రమంగా లెక్కించాలి.
– మహంతేష్, టీడీ పల్లి, రొళ్ల మండలం

ఫలితాలు ఆశ్చర్యం కలిగించాయి



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ప్రజలకు మంచి చేయాలని ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారు. ఎంతో మేలు చేసిన సీఎం జగన్‌కు ప్రజలు ఓట్లేయకుండా ఉంటారా? నాతో పాటు సామాన్య ప్రజలకు కూడా అనుమానం కలుగుతోంది. ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత వచ్చే అవకాశమే లేదు.
– జయశేఖర్‌రెడ్డి, కొత్తచామలపల్లి

ఈవీఎంలపై అనుమానం ఉంది



ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలుపుపై అనుమానం ఉంది. ఈవీఎంలు తారుమారు కావడంతోనే ఫలితాలు కూటమి వైపు ఏకపక్షంగా వచ్చాయి. ఎన్నికల కమిషన్‌పై కూడా ప్రజల్లో అనుమానాలు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఆదరణ ఉన్నప్పటికీ టీడీపీకి ఎక్కువ ఓట్లు ఎలా పడ్డాయో అర్థం కావడం లేదు.
– శంకర్‌రెడ్డి, తుంగోడు, సోమందేపల్లి మండలం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు, మునిమడుగు, పంచాయతీ గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. వెంకటరెడ్డిపల్లిలోని 33.11 కేవీ విద్యుత్ లైన్ అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు నిలిపివేస్తున్నామన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



రొళ్ల : మొక్కలు నాటుతున్న పెనుకొండ ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్‌రెడ్డి



పావగడ: మొక్క నాటుతున్న న్యాయమూర్తి మాదేశ్

రొళ్ల: ప్రతి ఒక్కరూ మొక్కలు పెంపకాన్ని చేపట్టి పర్యావరణాన్ని పరిరక్షించాలని పెనుకొండ అటవీశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని రొళ్ల కొండగ గ్రామ సమీపంలోని అటవీశాఖ నర్సరీ సరిసర బీడు భూముల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిబ్బందితో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు పెంచడం వల్ల కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పొందవచ్చన్నారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల ఆవరణతో పాటు ప్రభుత్వ స్థలాలు, బీడు భూముల్లో మొక్కలు నాటడానికి ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

గోరంట్ల: మండల వ్యాప్తంగా బుధవారం ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలపల్లి, బూదిలి, కొండాపురం సెక్టర్ పరిధిలోని అంగనివాడీ కేంద్రాల వద్ద అంగనివాడీ సిబ్బంది మొక్కలు నాటారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి, అంగనివాడీ వర్కర్లు పాల్గొన్నారు.

హిందూపురం: భూమిపై అన్ని జీవరాసులకు ఆహారాన్ని ప్రాణవాయువును అందించి కాపాడే భూమిని రక్షించే వృక్షాలను ప్రతి ఒక్కరూ పరిరక్షించాల్సిన అవసరం ఉందని ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు అన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెనుకొండ ఫారెస్ట్ రెంజ్‌లోని హిందూపురం పరిసరాల్లో విస్తరంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో హరిలాల్ నాయక్, రంజిత్, గంగాధర్, నాగేంద్ర, అటవీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అగళి: పర్యావరణాన్ని కాపాడితేనే మానవ మనుగడ సాధ్యమని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జాఫార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పర్యావరణ దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

పావగడ: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి మాదేశ్ నాగలమడక హోబళి ఉప్పారహళ్లి అటవీ ప్రాంతంలో బుధవారం పది వేల మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లాడుతూ వనాల అభివృద్ధితోనే వానలు కురుస్తాయని, కరువు కాటకాలు తొలగిపోయి ప్రజలు ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతారన్నారు. కార్యక్రమంలో ప్రధాన సివిల్ జడ్జి సుధీర్, ప్రియాంక, అటవీశాఖ అధికారి రాకేశ్, బసవరాజు, ఏపీపీ నటరాజ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషానందన్, కార్యదర్శి ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.



గోరంట్ల: మొక్కలు నాటుతున్న ఐసీడీఎస్ సిబ్బంది



హిందూపురం: అటవీ మార్గంలో మొక్కలు నాటుతున్న అధికారులు



అగళి: మొక్క నాటి నీరు పోస్తున్న విద్యార్థినులు